

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## కేంద్ర సెన్సార్ బోర్డు మెంబర్‌గా మరోసారి టి.వి.రంగయ్య నియామకం

**షాద్‌నగర్ జనవరి8,ప్రభాతవార్త :**

ప్రముఖ కళాకారుడు, నటుడు, దర్శకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు జాతీయస్థాయిలో నిరంతరం పలుసాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు టి.వి. రంగయ్యను సెంట్రల్‌ఫిల్మ్‌సెన్సార్‌బోర్డుమెంబర్ కేంద్రప్రభుత్వం తననియామకాన్ని మరోమూడేళ్లపాటు పొడిగించింది. మరోసారి సెన్సార్‌బోర్డుమెంబర్‌గా నియమించినందుకు మినిస్ట్రీఆఫ్‌ఇన్ఫర్మేషన్‌అండ్‌బ్రాడ్‌కాస్టింగ్ గవర్నమెంట్‌ఆఫ్‌ఇండియాకు సంస్కారభారతిరాష్ట్రశాఖకి కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్‌లోని ప్రముఖకళాకారుడు, కళాజ్యోతి సాంస్కృతికసంస్థ అధ్యక్షుడు వడ్లరమేష్‌చారి, డాన్స్‌మాస్టర్ సంస్కారభారతి ప్రధానకార్యదర్శి శివ, కళాకారుడు వెంకటేశ్వర సంగీతకళానిలయం అధ్యక్షుడు ప్రవీణ్‌లు టి.వి.రంగయ్యను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్కారభారతి గౌరవఅధ్యక్షుడురంగనాథం, సహధాకారుడుబె జుగంధమేష్, సింగారంశ్రీనివాస్, హాజీపల్లిమాజీసర్పంచ్ వరప్రసాద్, దూరదర్శన్ మాజీస్టేషన్‌డైరెక్టర్ వెంకటనారాయణ, మల్లికార్జున్‌గౌడ్, దాసనత్యం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

**-పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు**

**ధారూరు, జనవరి 8, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని నాగారంగ్రామంలో వెంకన్నచౌరస్తా వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో రహదారి జలమయం అయింది. వాహనాలు వెళుతున్న సమయంలో గుంతలో ఉన్న నీళ్లు ఇతరులపైన పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాలలో ప్రజలు రోగాలపాలవుతున్నా అధికారులుమాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులు స్పందించి మరమ్మతులుచేసి ప్రజలు రోగాలబారినపడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణను వివరణకోరగా మిషన్ భగీరథ అధికారులకు పలుమార్లు చెప్పినా స్పందించడం లేదని ఆయన తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఆమనగల్లులో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు, జనవరి08, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వ తోడ్పాటుతో అంచెలంచెలుగా నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రజాకాంక్షమేరకు నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధిపరుస్తామని కల్వకుర్తి శాసన సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, కల్వకుర్తి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకచొరవ చూపుతుండడం హర్షించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జనరల్‌ఫండ్ రూ.83లక్షలతో నిర్మించబోతున్న సిసిరోడ్లు (58లక్షలు) అంతర్గత మురుగుకాల్వలు(25లక్షలు) పనులకు చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం ఆమనగల్లు పట్టణంలోని గ్రంథాలయం వద్ద శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అభివృద్ధిలో సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ట్రిబుల్ ఆర్, రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారులతో అభివృద్ధిలో కల్వకుర్తి నియోజకవర్గ రూపురేఖలు మార్చనున్నదన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోడ్పాటుతో నియోజకవర్గంలోని తలకొండపల్లిమండలం ఖానాపూర్‌గ్రామంలో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ మంజూరయిందని చెప్పారు. అలాగే రహదారులనిర్మాణంతో ప్రాంతాల అనుసంధానం పెరిగి, ప్రజల జీవనప్రమాణాలు పెంపొందుతాయని చెప్పారు. దీంతో ఆయాప్రాంతాల్లో ఉపాధిమార్గాల కల్పన పెరిగే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో వందలకోట్లతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రతిగ్రామానికి బిటిరోడ్డు ఉండాలనే ఆశయంతో రేవంత్‌రెడ్డి సర్కారు పంచాయతీరాజ్‌ను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వసంతరెడ్డి, కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, బైకని యాదమ్మ, శ్రీశైలంయాదవ్, సుందూరి ఝాన్సి చంద్రశేఖర్, సోన జయరాంనాయక్, గోరటి జ్యోతి నర్సింహ్మా, తల్లోజు విజయ్‌కృష్ణ, దివ్యశ్రీకాంత్‌సింగ్, కమటం రాధమ్మవెంకటయ్య, చెన్నకేశవులు, దుడ్డు కృష్ణయాదవ్, విక్రమ్‌రెడ్డి, సుజాతరాములు, కృష్ణ నాయక్, కోఆప్షన్ మెంబర్లు మేడిశెట్టి శ్రీధర్, యాదమ్మ, పాష, కాంగ్రెస్ నాయకులు, టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతనర్సింహ్మా, వస్పుల శ్రీశైలం, మండలపార్టీ అధ్యక్షుడు తెలగమళ్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై వ్యత్యాసం చూపకుండ అమలు చేయాలి

**-మల్కాజ్‌గిరి ఎంపి, ఈటల రాజేందర్**



దిశ సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారుల తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 8, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వ్యత్యాసం చూపకుండ అమలు పరుస్తూ, బలహీనవర్గాల ప్రజలకు చేయూత నందించటంతో పాటు జిల్లాను అభివృద్ధిదిశగా నడిపించటమే కాకుండా సమస్యలను చర్చించటానికి, పరిష్కరించానికి తరచూ సమావేశం అవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపి, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ దిశకమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈసమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. జిల్లాకమిటీ సభ్యులు పలువురు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, వివేకానంద, అరికెపూడి గాంధీ, మెంబర్ సెక్రటరీ, జిల్లాకలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపి, కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ జిల్లాలోని అన్నిశాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో పురోగతిని సమీక్షించారు. ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమశాఖల వారీగ నిర్వహిస్తున్న పథకాలద్వారా ఎంతమందికి లబ్దిచేకూరుతుందో తెలుసుకోవటం జరుగుతుందని, అవసరమైన సలహాలను, సూచనలు తెలియజేశారు. అధికారులుచేసే పనిద్వారా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. ఎక్కువగా పరిష్కారంకాని సమస్యలపై అధికారులు దృష్టికేంద్రీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డిఆర్‌డిఎ ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధిహామీచట్టం పథకం ద్వారా జిల్లాలో గ్రామీణపేదలకు 18,014జాబ్‌కార్డులు, 19,378మందికి పనికల్పించి 144.62లక్షల రూపాయల వేతనం చెల్లించామన్నారు. జిల్లాలో వనమహోత్సవంలోనూ వందశాతం లక్ష్యాలను సాధించామన్నారు. దీన్‌దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద జిల్లాలో 50మందికి ఎస్‌హెచ్‌జి గ్రూపుల వారికి బ్యాంకు రుణాలు ద్వారా రెడిటుఈట్ భాగంలో పచ్చళ్లు, స్నాక్స్ ప్రాసెస్ మిషన్ యూనిట్లను 3.69కోట్ల రూపాయలతో అందజేశామన్నారు. జిల్లాకలెక్టర్ గౌతమ్ పేర్కొంటూ జిల్లాను అభివృద్ధి దిశలో తీసుకవెళ్లటానికి ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని సమస్యలను పరిష్కరించటానికి కృషిచేస్తామని అన్నారు. ఈసమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్త, అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు స్వీయ నియంత్రణతోనే సాధ్యం

**నవాబుపేట, జనవరి 8, ప్రభాతవార్త:**

సైబర్ నేరాలను స్వీయ నియంత్రణతోనే రూపుమాపవచ్చని ఎస్ఐ అరుణన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ నకిలి కాల్స్‌ను పసిగట్టి చాకచక్యంగా సంబాసించాలన్నారు. ఎదుటివారి భాషను, మాటతీరును పసిట్టి వ్యవహరించాలని సూచించారు. తెలివిగా మాట్లడి సైబర్ నేరగాళ్ళ ఆటకట్టించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి అబ్దుల్‌రహమాన్, పీఎస్ఐ స్వేత, పాఠశాల ప్రధానోపాధ్యయుడు మల్లేశం, ఉపాధ్యయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేచుకోవాలి : కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జనవరి 8 ప్రభాతవార్త :** ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేచుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థిని విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025,26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదలిచిన బాలబాలికలు హెచ్‌టిటి.టిజిసిఈటి.సిజిజి.గౌవ్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదిలోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు పత్రం నెంబర్, ఆధార్, కుల ధృవీకరణ పత్రంం, ఫోటో అవసరమన్నారు. పై ధృవికరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టర్‌లో సహాయ కేంద్రం వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు. ఈ ఆవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# సత్తా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**-చేవెళ్ల జాతీయ రహదారి పనులు ప్రారంభిస్తాం**
**-చేవెళ్ల రాజకీయంగా చైతన్యవంతమైన ప్రాంతం**
**-మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భోళా శంకరుడు**
**-తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న రోడ్లభవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సహకారసంఘం గోదాంను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**చేవెళ్ళ, జనవరి 8, ప్రభాతవార్త:**

దమ్మున్న ముఖ్యమంత్రి మన రేవంత్‌రెడ్డి, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకువెళ్లేందుకు శత విధాల ప్రయత్నం చేస్తున్నారని, ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని సహకారసంఘం కార్యాలయం, గోదాంను, ముడిమ్యాల-మేడిపల్లి వరకు 24కోట్ల రూపాలయలతో వేసే రోడ్డుకు రాష్ట్ర రోడ్లభవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనసభ ఛీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల మాజీ ఎంపి రంజీత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి పామెన భీంభరత్‌లతో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా తెలంగాణరాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భోళాశంకరుడని, ఏదడిగినా కాదనకుండా ఇచ్చే మంచిమనిషన్నారు. చేవెళ్ల నియోజవర్గంతోపాటు వికారాబాద్ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి కోసం రూ.150కోట్లు మంజూరుచేశారన్నారు. చేవెళ్ల జాతీయ రహదారి పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. గత పది సంవత్సరాలలో జిల్లాకు రోడ్లను మంజూరు చేయలేదని, ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. స్వర్గీయ కొండా వెంకట రంగారెడ్డి, స్వర్గీయ ఇంద్రారెడ్డిలు రాజకీయ ఉద్ధండులని, చేవెళ్ల ప్రాంతంనుండి ప్రాతినిధ్యం వహించినవారు కావడం గర్వకారణమన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డుతోనే జిల్లాలో అభివృద్ధి జరిగిందన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణంతో జిల్లాలోని భూములకు ధరలు పెరిగాయని, రియల్ ఎస్టేట్ కూడా విపరీతంగా పెరిగిందన్నారు. జిల్లా అభివృద్ధి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే జరిగిందని, మళ్లీ కాంగ్రెస్‌ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితోనే తెలంగాణరాష్ట్రం అభివృద్ధి, సంక్షేమరంగాలకు ప్రాధాన్యత ఇస్తూ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచితవిద్యుత్‌ను, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పది లక్షలకు పెంపును అమలు చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే ఒక్క వ్యవసాయ రంగానికే యాభై నాలుగు వేల కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేశామన్నారు. భారతదేశ చరిత్రలలో ఏ రాష్ట్రం చేయని విధంగా 25లక్షలమంది రైతులకు 21వేల కోట్లరూపాయల రుణాలను మాఫీచేశామన్నారు. గతప్రభుత్వం లక్షరూపాయలవరకు రుణాలను మాఫీచేయడం కుదరదన్నారని, కాని సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం రెండులక్షల రూపాయల వరకు రుణాలను మాఫీచేసి దమ్మున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని నిరూపించుకున్నాడన్నారు. జనవరి 26 గణతంత్రదినోత్సవం నుండి రైతులకు రైతుభరోసా అందుతుందని, ఎకరాకు ఏడాదికి 12వేల రూపాయలను అందిస్తామన్నారు. రైతులకు సహాయం చేయాలని మనసులో ఉన్నా బడ్జెట్‌ను చూసుకుని జాగ్రత్తగా నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం ఆర్థిక పరిస్థితి కుదుటపడుతుందని, పరిస్థితి మెరుగయ్యాక మళ్లీ పెంచుతామన్నారు. గతంలో రోడ్లకు గుట్టలకు, రోడ్లకు రియల్ ఎస్టేట్ వెంచర్‌లకు కూడా రైతుబంధు ఇచ్చి 25వేల కోట్లను దుర్వినియోగం చేశారన్నారు. నిజంగా కష్టపడుతున్న రైతులకు రైతుభరోసా అందజేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం భూమిలేని వ్యవసాయకూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం కింద ఏడాదికి 12వేల రూపాయలసాయం అందుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చాకే పరీక్షలు నిర్వహించి నియామక ఉత్తర్వులు అందించామన్నారు. రాష్ట్రాభివృద్ధికోసం ప్రజలసంక్షేమంకోసం కష్టపడుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి మనందరం అండగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పడాల వెంకట్‌స్వామి, ముడిమ్యాల సహకారసంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల సహకారసంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్‌కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, జనార్ధన్ రెడ్డి, మర్పల్లి క్రిష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, పడాల ప్రభాకర్, సున్నపు వసంతం, గుండాల రాములు, మధుసూదన్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మహిళ నాయకురాళ్లు గోనే సరితప్రతాప్‌రెడ్డి, దేవర సమతవెంకట్‌రెడ్డి, బండారి శైలజఆగిరెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం..

**-జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**



డీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి**
**జనవరి 8, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో మహిళాసాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులోభాగంగా ప్రజాప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. స్వయంసహాయక సంఘాల ద్వారా సోలార్‌పవర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధిశాఖల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాలవారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజాభవన్‌లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి డిప్యూటీ సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా సాధికారతసాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సిఎం తెలిపారు. కొత్త విద్యుత్‌పాలసీ, ఇంధన, గ్రామీణాభివృద్ధిశాఖల మధ్య గతసంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లాకలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకువెళ్లాలని సూచించారు. 5సంవత్సరాల కాలంలో కోటిమంది మహిళల ను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని, మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీలేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు సోలార్‌పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వభూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళాసంఘాలకు ప్లాంట్ల ఏర్పాట్లులో ఆర్థికసహాయంకోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ ఏర్పాటుకు విద్యుత్‌శాఖ జెన్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్‌చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రతిజిల్లాలో 150ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేలఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్‌శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని. కేంద్ర అటవీహక్కులచట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. సోలార్‌విద్యుత్తు అందుబాటులోకివస్తే అటవీప్రాంతాల్లోనిరైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగుచేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో స్మాల్, మైక్రోపరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 4నుంచి 5ఎకరాలభూమి అవసరం అవుతుందని, చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్‌వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, డిఆర్‌డిఎ శ్రీనివాస్, ఎస్సి ఎలక్ట్రిసిటీ లీలావతి, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, గిరిజనసంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 30 కిలోల గంజాయి పట్టివేత

**వికారాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్

జిల్లాలో అక్రమంగా గంజాయి నిల్వ చేసిన 30 కిలోల గంజాయినీ పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో, తాండూరు పట్టణంలో ఓ వ్యక్తి గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్నాడనే విశ్వసనీయమైన సమాచారం మేరకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. ఇట్టి దాడులలో శిభారం స్వైన్ వద్ద 12 కిలోల ఎండు గంజాయి లభించింది. నింధితుడిని అదుపులోకి తీసుకని విచారిం చగా, ఒడిషా రాష్ట్రం గంజాం జిల్లా కు చెందిన వ్యక్తి గా వివరాలు తెలిపి నట్లు ఆయన పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి దాచి ఉంచిన 16 కిలోల ఎండు గంజాయి, 2 కిలోల గంజాయి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఈఎస్ తెలిపారు. మొత్తం 30 కిలోల గంజాయి పట్టుకున్నట్లు ఈఎస్ తెలిపారు. ప్రధాన నింధితుడైన శిభారం స్వైన్ ను అరెస్టు రిమాండ్‌కు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ కే.శ్రీనివాస్, ఎస్సై ప్రేమ్ కుమార్ రెడ్డి, సిబ్బంది విష్ణు వర్ధన్ రెడ్డి, హనుమంతు, రవికిరణ్, శివ, మహేందర్. కుమార్‌లు ఉన్నారు.

## బెల్టు షాపులు స్వచ్ఛందంగా అరికట్టడం శుభ పరిణామం



గ్రామస్థులతో మాట్లాడుతున్న సిఐ విజయ్‌కుమార్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 8:**

గ్రామాల్లో బెల్టు షాపుల కారణంగా పచ్చని పల్లెల్లో కక్ష్యలు, కార్పణ్యాలకు తావివ్వకుండా బెల్టు షాపులను స్వచ్ఛందంగా నిషేధించుకుని జరిమానాలు విధించడం శుభ పరిణామమని షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ గ్రామంలో గ్రామస్థులు బెల్టు షాపులలో మద్యం అమ్మకాలను నిషేధించడంపై స్థానిక సిఐ బుధవారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులను అభినందించారు. ప్రజలు కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి బాటలో ముందుకు నడవాలని సూచించారు. అన్ని పనులు ప్రభుత్వం చేయలేదని, ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి, ప్రభుత్వ శాఖలకు సహకరించి మంచిచెడు ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని విజయ్‌కుమార్ సూచించగా వెంటనే గ్రామస్థులు స్పందించారు. సిసి కెమెరాల కోసం వెంటనే విరాళాలు సేకరించారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. గ్రామంలో ఉన్న చైతన్యాన్ని చూసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామస్థులను, యువతను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చించోడ్ గ్రామస్థులు సిఐ విజయ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు.

# దొంగలు వస్తున్నారు జాగ్రత్త .!

**-తాండూరులో బెంబేలెత్తిస్తున్న బాల్కీ గ్యాంగ్**
**-తాళం వేసిన ఇండ్లే టార్గెట్**
**-గుట్టుచప్పుడు కాకుండా చోరీలు**
**-తగ్గిన పోలీస్ పెట్రోలింగ్**
**-వాహనదారుల ఛలాన్‌లపైనే దృష్టి**

**తాండూరు, జనవరి 8, ప్రభాతవార్త:**

ప్రజలరక్షణకు మేమున్నాం అంటూ భరోసా కల్పించాల్సిన పోలీసులు.. మీగ్రామాలలోకి దొంగలు వస్తున్నారు జాగ్రత్త అంటూ పోలీసులే ముందస్తుగా ప్రజలను భయపెట్టడం తాండూరులో చర్చనీయాశంగా మారింది. వికారాబాద్ జిల్లా కర్ణాటక సరిహద్దు తాండూరు నియోజకవర్గంలో ఇటీవల బాల్కి దొంగల్ గ్యాంగ్ బెంబేలెత్తిస్తుంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన ఈ దొంగల గ్యాంగ్ తాండూరు నియోజకవర్గంలోని గ్రామాలలో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. బుధవారం తాండూరు రూరల్ పరిధిలోని కరణ్‌కోట్ పోలీసులు ఈ గ్యాంగ్‌కు సంబంధించి ఫోటోలు, వీడియోలు మీడియాకు రిలీజ్ చేశారు. గ్రామాలలో దొంగలు తిరుగుతున్నారు జాగ్రత్త అంటూ సమాచారం ఇచ్చారు. అయితే, ఈ నెల 1న తాండూరు మండలం కోనాపూర్ గ్రామంలో నాలుగు ఇండ్లలో చోరీలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ చోరీల వెనక కర్ణాటకకు చెందిన బాల్కీ దొంగల గ్యాంగ్ ఉన్నట్లు నిర్ధారించినట్లు పోలీసులు మీడియాకు తెలిపారు. కోనాపూర్ గ్రామంలో జరిగిన చోరీల ఘటనపై సిసి పుటేజీని పరిశీలించగా ఈ గ్యాంగ్‌కు సంబంధించి కదలికలు భయటపడ్డాయి. ఈ విషయంపై గ్రామలలో నలుగురు లేదా ఐదుమంది వ్యక్తులు ఉన్న ఈగ్యాంగ్ గ్రామాలలో తిరుగుతారని, తాళంవేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతారని పోలీసులు గుర్తించారు. ఈగ్యాంగ్ చోరీచేయాల్సిన గ్రామాల సమీపంలో ఏదో ఒకప్రాంతంలో రాత్రిపూట బసచేస్తూ.. అర్ధరాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. వచ్చినపని ముగిశాక అక్కడినుండి వెళ్లిపో తారని అన్నారు. ఈగ్యాంగ్‌కు సంబంధించి అనుమానితులుగా సమాచారం తెలిస్తే పోలీసులుకు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈమధ్యకాలంలో తాండూరు పట్టణంతోపాటు నియోజక వర్గంలోని గ్రామాలలో పోలీసుల పెట్రోలింగ్ తగ్గిందని.. వాహనాల చెకింగ్‌లు, ఛలాన్లపైనే దృష్టిసారిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాండూరు పట్టణంలో అర్ధరాత్రివరకు యువకులు రోడ్లపైనే సంచ రించడంతోపాటు పట్టణశివారు ప్రాంతంలోని పలుహోటళ్లు అర్ధరాత్రి వరకు కొన సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలని కోరుతున్నారు.

# అనిమియా ముక్త్ భారత్ కార్యక్రమం



**అత్తాపూర్ జనవరి8,ప్రభాతవార్త :** వివేకానంద జయంతిని పురస్కరించుకొని అత్తాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8,9,10వ తరగతి విద్యార్థినిలకు అనిమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ త్రిశక్తి శాఖ రాజేంద్రనగర్ మండల ప్రెసిడెంట్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ మహేశ్వర్ రెడ్డి,శ్రీధర్,తెలంగాణ ప్రాంట్ ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ రాఘు,సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ శంకర్ రాథోడ్ ,మోటోవేషనల్ స్పికర్ శ్రీధర్,పాఠశాల ఇన్‌చార్జీ హెచ్ ఎం రజియా బేగం,ఉపాధ్యాయుడు రోజారాణిలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసగించారు.పిల్లలకు పరీక్ష నిర్వహించారు.ప్రతి విద్యార్థికి నువ్వుల ఉండలు అందజేశారు.విద్యార్థులను పరిక్షించగా రక్తహినత లోపం ఉన్నట్లు కనుకొని వారికి ఐరన్ ట్యాబ్‌లెట్స్ ,విటమిన్ ట్యాబ్‌లెట్స్ అందజేశారు.

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



**అత్తాపూర్ జనవరి8,ప్రభాతవార్త :** మహిళల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ,షాదీముబారాక్ లబ్ధిదారులకు మంజూరైన 482 చెక్కులను తహసీల్దార్ రాములతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు.పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మీ,షాదీముబారాక్ పథకాలు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షుడు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్‌ను కలిసిన మేరు సంఘం సభ్యులు



రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ మేరు సంఘం నాయకులు

**చార్మినార్,జనవరి 8 ప్రభాతవార్త :** చిప్పోళ్ళు మేరు కులంగా ఉన్న మా కులాన్ని మేరుగా మార్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం నాయకులు బుధవారం రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మేరు సంఘం మాజీ అధ్యక్షులు కొవ్వూరు భాస్కర్‌రావు,ట్రస్టు చైర్మన్ పొడిశెట్టి నరిసింగరావు,హాడ్‌హాక్ కమిటి కన్వీనర్ అడపా వెంకటేశ్వరరావుతో పాటు పలువురు కలిసి వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజిట్‌లో చిప్పోళ్ళ మేరుగా మా కులం నమోదై ఉందని,దీనిని తొలగించి మేరు కులంగా నమోదు చేయాలని కోరారు.కార్యక్రమంలో కీర్తి రాజ్‌గోపాల్,కె.వెంకటేష్, ఎస్.బి.సంఘే వార్,దీకొండ నరసింగరావు,మాడిశెట్టి లక్ష్మీ నారాయణ,తాళ్ల సంపత్ కుమార్,కొత్తకొండ కరుణాకర్, బాలకొండ రవితేజ,వివిధ జిల్లాల అధ్యక్షులు పెంద్యాల హరి ప్రసాద్,నన్నే లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయంపై దాడి చేసిన వారిన అరెస్ట్ చేయాలి



ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బిజెవైఎం నాయకులు

**యాకుత్‌పుర,జనవరి 6 ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని ఛత్రినాకలో బుధవారం బిజెవైఎం భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను బిజెపి నాయకులు దహనం చేశారు.భాగ్యనగర్ జిల్లా బిజెవైఎం అధ్యక్షులు భరత్ కుమార్, యువ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శివ చంద్రగిరిలు మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి కార్యాలయంపై చేసిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువ మోర్చ నాయకులు అర్జున్,బిట్టు,నర్సింగ్,సిరి వెన్నెల, అనిరుద్,మహేష్,సచిన్,సుభాష్,రవి,రోహన్,షాకేత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# బృందావన్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి,అధికారులు

**మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 8 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి,జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు.కాలనీలో సిసి రోడ్లు,వీధి దీపాలు,డ్రైనేజీ తదితర సమస్యలపై పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జి.పాండు యాదవ్,రావుల భాస్కర్,రవి వివరాజ్,దామాజీ మల్లి ఖార్జున్, మంజునాథ్,మల్లేష్ దత్తు,శ్రీనివాస్, సూర్యకాంత్, రమేష్,తలారి చిన్న,ఎల్‌వి రెడ్డి,అనిల్ శంకర్ రెడ్డి,జయదేవ్ పాల్గొన్నారు.

# మణికొండలో మున్సిపల్ ఎన్నికల హామీలన్నింటిని పూర్తి చేశాం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జనవరి 8 ప్రభాతవార్త :** గత మున్సిపల్ ఎన్నికల సమయంలో మణికొండ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తి చేశామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌తో కలిసి 5.కోట్ల 6లక్షల 50.వేల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. 9.వ,వార్డు అల్కాపూర్ టౌన్‌షిప్ పార్కు-1 అభివృద్ధి కోసం రూ.కోటి 4.లక్షలు, 7.వ,వార్డులో రూ.50.లక్షలతో బాక్సు కల్వర్టు నిర్మాణం పనులు, వేంకటేశ్వర కాలనీలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ పనులు, 6.వ,వార్డు అలిజాపూర్‌లో సెంట్రల్ లైటింగ్స్, 5.వ,వార్డు ఫ్రెండ్స్ కాలనీలో రూ.50.లక్షలతో సిసి రోడ్డు పనులు, 13.వ,వార్డు పోచమ్మ కాలనీలో కమ్యూనిటీ హాల్, లక్ష్మీనగర్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ చెప్పింది చేయడం, చేసేదే చెప్పడం కాంగ్రెస్ పార్టీ లక్షణమని వివరించారు. ప్రజలిచ్చిన అధికారంతో ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు నిరంతరం పని చేస్తున్నామని తెలిపారు. 99. శాతం వరకు మౌళిక వసతులు కల్పించామని, ఇంకా ఎక్కడైనా ఏమైనా సమస్యలుంటే స్థానిక ప్రజలు మా దృష్టికి తీసుకు రావాలని, వెంటనే పరిష్కరిస్తామని ప్రకాశ్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రదీప్ కుమార్, వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నాయకులు యాలాల నరేష్, బుద్ధోలు శ్రీరాములు, ఏర్పుల కుమార్, కౌన్సిలర్ కావ్యశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ ఐక్యసాధన సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పల్లెరవికుమార్‌గౌడ్, నారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బాలరాజుగౌడ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త:** గౌడ ఐక్యసాధన సమితి 2025 క్యాలెండర్ ఆవిష్కరణ బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా జరిగింది. దీనికి మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, బిసి కమిషన్ సభ్యులు బాలలక్ష్మీ, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ లు ముఖ్యఅతిధులుగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాష్ట్రంలో గౌడకులస్తుల స్థితిగతులు, కల్లుకాంపౌండ్‌లపై దాడులు, పెండింగ్‌పనులు, ట్యాంక్‌బండ్‌పై సర్వాయిపాపన్న విగ్రహం, జనగామాజిల్లాకు పాపన్న పేరు వంటిఅంశాలపై చర్చించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీఊ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, గోపా అధ్యక్షులు బండి సాయన్నగౌడ్, ఐలి వెంకన్నగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఎం.విరమణ, బబ్బూరి బిక్షపతి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మందాను విజయరాణి, పచ్చిమాడ్ల మానసాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉంటాం : ఆశ్విని సుబ్బారావు



పేద విద్యార్థుల ఫీజులను పాఠశాల యాజమాన్యానికి అందజేస్తున్న ఆశ్విని సుబ్బారావు

**శేరిలింగంపల్లి, జనవరి 8ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థులకు ఎల్లప్పుడు తాను అండగా ఉండటంతోపాటు వారి విద్యకోసం తనవంతు కృషిచేస్తానని ఆశ్విని హెయిర్ ఆయిల్ సంస్థల చైర్మన్ ఆశ్విని సుబ్బారావు అన్నారు.చందానగర్ ప్రాంగణంలోని సరస్వతి విద్యామందిర్‌లో తండ్రిని కోల్పోయిన విద్యార్థిని, విద్యార్థులకు. అదే విధంగా పేద విద్యార్థినీ,విద్యార్థులకు ఫీజుల వితరణ కార్యక్రమం జరిగింది.ఆశ్విని హెయిర్ అయిల్ సంస్థల ఛైర్మన్ ఆశ్విని సుబ్బారావు స్వయంగా పేదవిద్యార్థులకు, తండ్రిని కోల్పోయిన విద్యార్థిని,విద్యార్థులకు ఫీజుల నిమిత్తం తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అశ్విని సుబ్బారావు మాట్లాడుతూ.. కాలం మారినప్పకిటీ ఎంత ఉత్తమ విధ్యనభ్యసించినప్పటికి మన మూలాలను, సంస్కారాన్ని మరిచిపోకూడదని ఆయన విద్యార్థులకు ఉద్బోదించారు. అనంతరం 30 విద్యార్థిని, విద్యార్థులకు 1లక్షా 50 వేల రూపాయల చెక్కును పేద విద్యార్థుల ఫీజుల నిమిత్తం సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు అందచేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల శెక్రటరీ రఘునందర్‌రెడ్డి, కోశాధికారి నాగభూషణరావు, జాయింట్ శెక్రటరీ శ్రీరామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు రావాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త:** నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు రావాలని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం నేచర్ లైఫ్‌స్పేస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నేచర్ లైఫ్‌స్పేస్ ఛైర్మన్ ఫౌండర్ రమేష్ ముదు, కోఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ మేఘన రమేష్, ప్రెసిడెంట్ వినాయక్ ముదు, నగేష్, రాజశేఖర్, రవీందర్, సుగుణ పాల్గొన్నారు. ఈ సంవత్సరం అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## గాయని రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు



గాయని రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త:** పాటలోని సాహిత్యాన్ని తాను ఆస్వాదిస్తూ ప్రేక్షక మనోరంజకంగా పాడ గల ప్రజ్ఞా నిధి రేణుక అని వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) నిర్వహణలో మధుర గాన మయూఖగా పేరు పొందిన గాయని రేణుకకు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రదానం చేసి వంశీ రామరాజు మాట్లాడారు. విఖ్యాత నటులు ఎన్‌టీఆర్, ఎఎన్ఆర్, సావిత్రి, జమున వంటి మహానటులు వంశీ సంస్థలకు ఎంతో ఆప్తులు అని, సావిత్రి డిసెంబర్ లోనూ మిగిలిన ముగ్గురు జనవరి లో మృతి చెందారనీ, వారి వర్ధంతి సందర్భంగా వారు నటించిన సినిమాలలోని పాటలతో స్వర నీరాజనం అర్పించారు. రేణుక సహ గాయకుడు వైఎస్ రామ కృష్ణ తో కలిసి పలు పాటలు మధురం గానం చేశారు. సుధామయి వ్యాఖ్యానం సందర్భోచితంగా వుంది సుంకరపల్లి శైలజ , నటుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జై హనుమాన్ సినిమాలో హనుమంతుడి పాత్రపై కోర్టులో కేసు



సమావేశంలో హనుమంతుడి పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న మామిడాల తిరుమల్‌రావు

**సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త:** మైత్రి మూవీస్ బ్యానర్‌పై తీసిన జై హనుమాన్ సినిమాలో హీరో రిషబ్‌శెట్టి నటించిన హనుమంతుడి పాత్ర రామాయణం లో హనుమంతుడిలా కాకుండా మానవ హనుమాన్ ముఖంను చూపిస్తూ వక్రీకరించారని, పాత్రలో కేవలం రిషబ్ శెట్టి రూపం కనిపిస్తున్నదని, దీనిపై ఈ మేరకు నాంపల్లిలోని క్రిమినల్ కోర్టులో కేసు వేయడం జరిగిందని పలువురు న్యాయవాదులు తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైకోర్టు న్యాయవాదులు మామిడాల తిరుమల్‌రావు, అరుంధతి, మాధవ్ బందికి మాట్లాడుతూ గత అక్టోబరు 30వ తేదీన జై హనుమాన్ సినిమా పోస్టర్‌ను సినిమా దర్శక,నిర్మాతలు ప్రశాంతవర్మ, నవీన్, రవిశంకర్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పోస్టర్‌లో హనుమంతుడి రూపంకు బదులు హీరో రూపాన్ని చూపించడం జరిగిందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తూ కోరుకు వెళ్ళడం జరిగిందని చెప్పారు. న్యాయ స్థానాల చట్టం ప్రకారం 299, 196 సెక్షన్‌ల కింది కేసు వేశామన్నారు. ఈ విధంగా చిత్రాలను, పోస్టర్‌లను రూపొందించడం వల్ల హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని, సామాజిక అసమ్మతికి దారి తీస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సినిమాలోని రిషబ్‌శెట్టి రూపాన్ని మార్చాలని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సెన్సార్ బోర్డు, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

## మహిళల్లో సృజనాత్మక శక్తి పెంపొందేందుకు ముగ్గుల పోటీలు దోహదం



చందానగర్‌లో ముగ్గులపోటీలలో పాల్గొన్న మహిళలు

**శేరిలింగంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త** మహిళలలో పోటీతత్వంతో పాటు సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ముగ్గులపోటీలు దోహదం చేస్తాయని కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు,గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ,ప్రోత్స హాతక బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా బుధవారం బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ కళాశాల నందు విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించటం జరిగింది. విజేతలకు బహుమతులను ప్రదానం చేసిన అనంతరం మాజీ కార్పొరేటర్, కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ మాట్లాడుతూ.. పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులని అన్నారు. ముగ్గుల పోటీల వలన మహిళలల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసే అవకాశం ఉంటుందన్నారు. పట్టణీకరణ నేపధ్యంలో అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరిగిన క్రమంలో భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయన్నారు నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి ,సంప్రదాయాలను కొనసాగించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించటం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత,అధ్యాపకురాళ్లు డాక్టర్ అనురాధ, ప్రజ్వల,జ్యోతిర్మయి,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వరలక్ష్మీ,అనూష తదితరులు పాల్గొన్నారు.

## వైవిధ్యభరితం చాకలి ఐలమ్మ నాటక ప్రదర్శన

**నాంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎంపిఏ రంగస్థల కళలశాఖ విద్యార్థులు అభ్యాస ప్రదర్శనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో వీరనాటి చాకలి ఐలమ్మ నాటకాన్ని అత్యంత అద్భుతం, వైవిధ్యభరితంగా ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. రంగస్థల కళలశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎ.రాజు రచన, దర్శకత్వంలో ప్రదర్శింపబడిన ఈ నాటకంలో ఆయా పాత్రల్లో విద్యార్థులు జి.నేహాల్, ఆర్.వెంకటలక్ష్మణ్, బిహెచ్.కళ్యాణి, ఎస్.ఎం.భాషా, కేశవకుమార్, లీలావతి, ఎస్.కె.హర్షత్, కె.శ్రీకాంత్, బి.సాయికిరణ్, వేణుగోపాల్, టిఎస్.సుజాత, పవిత్ర, శ్రీకర్, గౌతమ్, రాఘవేంద్ర, శ్రీమంత్, రాణాప్రతాప్‌లు తమ తమ పాత్రలకు జీవంపోశారు. మేకప్ మల్లాది గోపాలకృష్ణ, లైటింగ్ రాజుబ్రదర్స్, సంగీత ఆర్.వెంకలక్ష్మణ్, కాస్ట్యూమ్స్ సహకారం రంగస్థల కళలశాఖ, గాయకులు, డప్పు సాయిమురళి, సాయికిరణ్, మంజునాథ్, జైపాల్, మహేందర్‌ల సహకారంతో నాటకం అద్భుతంగా ప్రదర్శింపబడింది. ఈ ప్రదర్శనకు విచ్చేసిన రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, శాఖాధిపతి డా. బిహెచ్. పద్మప్రియలు విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు.

# వీఎన్ఆర్ విజెఐఈటిలో ఇంజినీరింగ్ విద్యపై అతర్జాతీయ సదస్సు ప్రారంభం..



సదస్సులో పాల్గొన్న వక్తలు

**నిజాంపేట్, జనవరి 8, ప్రభాతవార్త** ప్రగతినగర్లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ విద్య రూపాంతరణ ఇతివృత్తం ఉత్పాదక యంత్రమేధ తరంలో ఇంజినీరింగ్ విద్యలో అవసరమైన సమూలమైన మార్పులు కేంద్రంగా మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు ఐసీటీఐఈఈ 2025 బుధవారం ప్రారంభమైంది. వీఎన్ఆర్ వీజేఐఈటీతో సహా విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (వీజేఐఎం) ఆతిథ్య సంస్థలుగా ఇండో యూనివర్సల్ కొలాబొరేషన్ ఫర్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ (ఐయూసీఈఈ) సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సు 12వ సంపుటిలో గౌరవ అతిథి, ఎబీఈటీ (యూఎస్ఏ) సీఈఓ డా. మైఖెల్ మిలిగన్, ఐయూసీఈఈ వ్యవస్థాపకులు, కార్యనిర్వహక సంచాలకులు, ఆచార్య డా. కృష్ణ వేదులతో సహా యూఎస్ఏ ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, ఫిన్లాండ్, పోర్చుగల్ తదితర దేశాల నుంచి, భారతదేశంలో పలు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు పరిశ్రమకి చెందిన నిపుణులు పాల్గొన్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో వక్తలు మాట్లాడుతూ కృత్రిమమేధ వలన ఒనగూరే ప్రయోజనాలు, అనుకూల ప్రతికూల ప్రభావాలు, నేటి తరం విద్యార్థులకు అనుగుణమైన విద్యాబోధనాసరళి, సమస్యాపరిష్కర్తలుగా బాధ్యతాయుతంగా ఎదగటానికి తగిన స్థైర్యంతో యువ విద్యార్థులను తీర్చిదిద్దవలసిన అవసరం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. పాఠ్యక్రమాభివృద్ధి, సాంకేతికత ద్వారా అధునాతన అభ్యసనం, మూల్యాంకన ప్రభావశీలత అంచనా, ఇంజినీరింగ్ విద్యలో పరిశోధన తదితర అంశాలపై పలు కార్యశాలలు, ప్రసంగాలు, కీలకోపన్యాసాలు, పరిశోధన పత్ర సమర్పణ ఈ సదస్సులో భాగమయ్యాయి. సదస్సులో భాగంగా ఐయూసీఈఈ వార్షిక విద్యార్థి సమితి ఐఏఎస్ఎఫ్ 2025 పేరిట పలు రాష్ట్రాల విద్యార్థుల డిజైన్ థింకింగ్, ఇంజినీరింగ్ ప్రాజెక్టుల ప్రదర్శనతో సహా విద్యార్థులు, అధ్యాపకులకు ప్రత్యేక కార్యశాలలు కూడా నిర్వహించాడు. "నేను బోధిస్తున్నాను, వాళ్ల నేర్చుకుంటున్నారా? అన్న ప్రశ్న ప్రాతిపదికగా ఏర్పడిన సంస్థగా ఖయూసీఈఈ ఇంజినీరింగ్ విద్యని మరింత ప్రభావవంతమైన మాధ్యమంగా తయారు చేయటం ముఖ్యమని అతిథులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను కూడా ఆతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డా.వై.పద్మశాయి, సంచాలకులు డా.బి.చెన్నకేశవరావు, ప్రధానాధ్యాపకులు డా.సి.డి.నాయుడు, బీజేఐఎం సంచాలకులు డా. భరతభూషణ్ బంగ్, విజ్ఞానజ్యోతి సంస్థల పురోగమన సంచాలకులు డా. కోడె సంధ్య, విజ్ఞానజ్యోతి సంస్థ పూర్వాధ్యక్షులు డా.డి.ఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సంస్థల్లో అక్రమ పదోన్నతులను సమీక్షించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఈటెల రాజేందర్, వెంకన్నగౌడ్, కుమారస్వామి,యాదగిరి తదితరులు

**హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ సంస్థల్లో అక్రమ పదోన్నతులను వెంటనే సమీక్షించాలని విద్యుత్ బిసి ఉద్యోగుల మహాసభ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభను ఖైరతాబాద్‌లోలో మోక్షగుండం విశ్వేష్వరయ్య భవన్‌లో నిర్వహించారు. దీనికి మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై 2025 సంవత్సరానికి చెందిన డైరీ, వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాజమాన్యాలు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు ధిక్కరణ కేసును సాకుగా చూపి 2022లో వందలాది ఉద్యోగులకు షరతులతో కూడిన పదోన్నతులు కల్పించారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతులు షరతుల ప్రకారం సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాల్సి ఉందని అయినప్పటికీ మరో కొత్త నిబంధనతో అడ్ హాక్ పద్దతిలో హైకోర్టు, సుప్రీంకోర్టు, 2019లో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఇటీవల వేలాది మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. ఫలితంగా వేలాది మంది బీసీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందన్నారు. కొందరు బిసి ఉద్యోగులు పదోన్నతి లేకుండానే పదవీవిరమణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,విద్యుత్ యాజమాన్యాలు వెంటనే స్పందించి పరిష్కరించాలని లేని పక్షంలో బిసి ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు.ఈ మహా సభలో రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్, ఎం అశోక్ కుమార్, డాక్టర్ చంద్రుడు, పి యాదగిరి, మారం శ్రీనివాస్, నీలారపు రాజేందర్, సదానందం, సామల శివాజీ, ఏం విజయ కుమార్, కొమరవెల్లి రవీందర్, ఆడెపు శ్రీకాంత్, పిల్లి అశోక్, ప్రవీణ్, నరేందర్, కిశోర్, వెంకటేష్ తదితర నాయకులు, రాష్ట్ర నలుమూలల నుండి వందలాది మంది బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలి

-పార్టీ కార్యాలయంపై దాడి చేయడం సిగ్గుచేటు

-దాడిని ఖండిస్తూ ఆరంఘర్‌లో బిజెపి నిరసన



**అత్తాపూర్ జనవరి8,ప్రభాతవార్త :** యువజన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర బిజెపి కార్యాలయంలో దాడి చేయడం సిగ్గుచేటు అని పలువురు బిజెపి నాయకులు మండిపడ్డారు.రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు నాంపల్లిలోని రాష్ట్ర బిజెపి కార్యాలయం పై కర్రలతో కోడిగుడ్లతో దాడి చేయడాని ఖండిస్తూ బుధవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో అరాంఘర్ చౌరస్తా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను తగలబెట్టుతుండగా రాజేంద్రనగర్, మైలార్దేవ్ పల్లి, అత్తాపూర్ పోలీసులు బిజెపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం బిజెపి నాయకులు మాట్లాడుతూ... ఏ పార్టీ నాయకులైన ఏమైనా పొరపాటుగా మాట్లాడితే రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప పార్టీ కార్యాలయం పై దాడి చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ కర్రలతో కోడిగుడ్లతో వీధి రౌడీల్లా ప్రవర్తించడానికి ఖండిస్తున్నామని మీరు రాష్ట్రంలో అధికారంలో ఉంటే మేము కేంద్రంలో అధికారంలో ఉన్నామని ఒక్కసారి గుర్తుంచుకోవాలని దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని మేము దాడి చేయడం మొదలుపెడితే ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా రోడ్లపై తిరగలేరని హెచ్చరించారు. పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ , చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్, మల్లారెడ్డి , జిల్లా కార్యదర్శి కొమురయ్య, నాయకులు జోగి రవి, అడికె రాజు, జయనంద్ రెడ్డి, యన్. జగన్, , విజయ్ కుమార్, ,వెంకటేష్,బి. బాబురావు అడికె జనార్ధన్, మురళీధర్ రెడ్డి రావుల భాస్కర్ హరికిషన్ జి సోల్కర్ రెడ్డి, రావుల జగన్, బి. మోహన్, వెంకట్ రెడ్డి విజయ్ మనోజ్ తివారి రాజు నాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

## హెచ్ఎంపివి వైరస్‌తో కలవర పడాల్సిన అవసరం లేదు

-ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అధ్యక్షులు డాక్టర్ వసంత్ కలాత్కర్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడతున్న వసంత్ కలాత్కర్, యోగేష్, డా.రంగయ్య తదితరులు

**హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త:** హెచ్ఎంపీవీ వైరస్‌తో కలవర పడాల్సిన అవసరం లేదని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అధ్యక్షులు డాక్టర్ వసంత్ ఎం. కలాత్కర్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్ కేసులు దేశంలో పలుచోట్ల నమోదైన నేపథ్యంలో ఆందోళన చెందాల్సిన పని లేదని, కొవిడ్ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించారో అలాంటివి పాటిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దగ్గు, జలుబు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కనిపిస్తే వెంటనే పీడియాట్రిషియన్నుసంప్రదించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పీడియాట్రిషియన్‌లను ఒక వేదికపై తీసువస్తూ బుధవారం హైటెక్స్‌లో పెడికాన్ 2025 పేరుతో జాతీయ సదస్సును ప్రారంభించామని, ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 8 వేల మంది పీడియాట్రిషియన్లు పాల్గొంటున్నారని, పిల్లల వైద్యం వస్తున్న మార్పులు, పరిశోధనలపై ప్రదర్శనలు, వర్క్ షాప్లు ఉంటాయన్నారు. పెడికాన్ సదస్సులో హెచ్ఎంపీవీ వైరస్ పై ప్రత్యేకంగా నిపుణులతో చర్చలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సెక్రటరీ జనరల్ డాక్టర్ యోగేశ్ పి. పారిక్, కోశాధికారి అంతను భద్ర, పెడికాన్ చైర్పర్సన్ డాక్టర్ నీలి రాంచందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ఎం. సురేంద్రనాథ్. కోశాధికారి డాక్టర్ సుంకోజు భాస్కర్, సలహాదారులు డాక్టర్ రంగయ్య, డాక్టర్ నీలం మోహన్ తదితరులు పాల్గొన్నారు

# భయాందోళనలకు గురిచేస్తున్న యువకులకు జైలు శిక్ష

**ముషీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** స్థానిక ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్న నలుగురు యువకులకు నాంపల్లి ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారు. ముషీరాబాద్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం రసూల్‌పురాకు చెందిన అమీర్ (23), భోలక్‌పూర్‌లో నివసించే మహ్మద్ నసీర్ (21) ఇరువురూ ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యూసెన్స్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఉండటంతో వారిపై పెట్టీ కేసు నమోదయింది. బుధవారం వారిని నాంపల్లి కోర్టులో హాజరుపరచగా 15రోజులు జైలు శిక్ష విధించారు. అదే విధంగా లేబర్ పనిచేసే బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఘనాపురం చిన్ని కృష్ణ (25), భోలక్‌పూర్‌కు చెందిన కే.ఈశ్వర్ (19) ఇరువరిపై పెట్టీ కేసు నమోదవటంతో బుధవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. వారికి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారని సీఐ తెలిపారు.

# భోజగుట్టలో వ్యక్తి హత్య

**మెహిదీపట్నం, జనవరి 8, ప్రభాతవార్త :** ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్ స్పెక్టర్ బైరి రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భోజగుట్ట వివేకానంద నగర్‌లో అరుణ్ (35) అనే వ్యక్తి కూలి పనులు చేసుకుని తన భార్య ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఇతను గత రెండు నెలల క్రితమే భోజగుట్టకు వచ్చి నివాసం ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున హత్యకు గురి అయ్యాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి ఒంటిపై ఉన్న గాయాలు పరిశీలించి సాక్షాదారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ హత్య ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మృతుడు అరుణ్ కు మద్యం తాగించి అతడు మద్యం మత్తులో ఉండగా గొంతు నిలిమి చంపినట్లు మృతుడి ఒంటిపై ఉన్న గాయాల ను బట్టి తెలుస్తుందని పోలీసులు తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరూ దళారులకు డబ్బులివ్వొద్దు : డిసి సమ్మయ్య



**బేగంపేట జనవరి 8,ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరూ దళారులకు డబ్బులు ఇవ్వవద్దని బేగంపేట డీసీ వి. సమ్మయ్య ప్రజలకు పిలుపు నిచ్చారు.పేదలు ఎవరైనా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దళారులకు డబ్బులు మాత్రం చెల్లించవద్దని ఎవరైనా డబ్బులు అడిగితే ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావాలని బేగంపేట డీసీ వి.సమ్మయ్య తెలియజేసారు.బేగంపేట సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని,డీసీ తెలియజేసారు. బేగంపేట లో మొత్తం 26049అప్లికేషన్లు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 14300ఇండ్ల సర్వే జరిగిందన్నారు.ఈ సర్వేలో ప్రజలు అధికారులకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు.దళారుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఎస్ఐ తోట మహేష్

## విద్యార్థి దశ చాలా కీలకం : ఎస్ఐ

**హుస్నాబాద్ రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :** జీవితంలో విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని ఎస్ఐ తోట మహేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని మాంటెస్సరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోని విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, సైబర్‌నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, గంజాయి, సీసీ కెమెరాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అమ్మాయిలు ఆకతాయిల అల్లర్లు, పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. విద్యార్థులను సరైనదారిలో నడిపించాల్సిన బాధ్యత తల్లితండ్రులతో పాటు అధ్యాపకులకే ఉంటుందని గుర్తు చేశారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా 100 లేదా షీటీమ్ నెంబర్ 8712667434 సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ


భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**కంగ్టి, జనవరి 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం మాదిగ దండోరా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎస్సీ వర్గీకరణ జరగాలని మంద కృష్ణమాదిగా అధ్యక్షుడు పిలుపుమేరకు ఆయా గ్రామాల్లో కమిటీని నిర్వహించి గ్రామ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుచ్చంద్ర మాదిగా, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పెద్ద గీతక్కమాదిగా, మహిళా జిల్లా అధ్యక్షురాలు కవిత మాదిగా, ఎమ్మార్పీఎస్ డివిజన్ కన్వీనర్ అలిగే జీవన్‌కుమార్‌మాదిగా, ఎంఎస్ఎఫ్ మాదిగా జర్నలిస్టు జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ మాదిగా, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు మాదిగా, జర్నలిస్టు డివిజన్ కన్వీనర్‌లు బాబు మాదిగా, రమేష్ మాదిగా, బోర్గి సంజీవ్, అబ్రాహం, మల్లేష్; మనోహర్, శ్రీమన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ


శంభు దేవాలయం బ్రహోత్స వాల గోడ పత్రికను ఆవిష్కరించిన దృశ్యం

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** దుద్దెడ శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాల గోడ పత్రికను బుధవారం అలయ అవరణలో అవిష్కరించారు. ఈ నెల 24,25,26 తేదిల్లో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అలయ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అలయ చైర్మన్ మంచాల శ్రీనివాస్, అలయ ట్రస్ట్ సభ్యులు పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, అనంతుల నరేందర్, మంచాల కృష్ణమూర్తి, గోనే శ్రీనివాస్, వెంకటేశం, నూనె కుమార్, వడ్డకొండ శ్రీనివాస్, దేశాయ్‌రెడ్డి, మంచాల చిన్న శ్రీనివాస్, రాజయ్య, పిల్లి నాగరాజు, తాజా మాజీ సర్పంచ్ మహదేవ్ గౌడ్, గుండెల్లి అంజనేయులు, దోమల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## గవలపల్లి తండాలో కబడ్డీ పోటీలు


మాట్లాడుతున్న సేవాలాల్ యూత్ సభ్యులు

**చిన్నశంకరంపేట, జనవరి 8, ప్రభాతవార్త:** మండల పరిధి గవలపల్లి తండాలో సంక్రాంతి పండుగ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 12 13వ తేదీల్లో కబడ్డీ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు నవీన్, శ్రీను, వినోద్ తెలిపారు. బుధవారం చిన్న శంకరంపేట లో వారు మాట్లాడుతూ ఆసక్తి కలవారు శుక్రవారం లోపు జట్టు వివరాలను నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. ఎంట్రీ ఫీజు 700 రూపాయలు ఉంటుందని, విజేతకు 15 వేల రూపాయలు, రన్నర్ కు 7000 రూపాయల బహుమతి ఉంటుందని వారు తెలిపారు. 8074700998, 9912291819, 7671973363 నంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** ఈ నెల 9న తిమ్మారెడ్డిపల్లి 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు తిమ్మారెడ్డిపల్లి, లకుదారం, మాత్‌పల్లి , కొనాయిపల్లి, గ్రామాల్లో విద్యుత్ సరపరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరు విద్యుత్ శాఖ సిబ్బ ందికి సహకరించాలని అయన కోరారు.

## సెంట్రల్ జైలును సందర్శించిన న్యాయమూర్తి

**కంది, జనవరి 8, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి రమేష్ మండల కేంద్రమైన కందిలోని సెంట్రల్ జైలను సందర్శించి ఖైదులకు పలు సూచనలు చేశారు. జైలు పరిసరాలను, బేరక్లను, గదులను, వంట గదిని, మరుగుదొడ్లను న్యాయమూర్తి పరిశీలించారు. జైలులు ఖైదీలకు అందుతున్న సౌకరాలపై ఖైదీలతో న్యాయమూర్తి ఆరా తీశారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిన నియమిస్తామన్నారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచిని న్యాయమూర్తి చూశారు. జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను న్యాయమూర్తి పరిశీలించారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

# విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు


ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త**

క్లాసుకు ఆలస్యంగా వచ్చారనే ఆరోపణతో 19 మంది గురుకుల విద్యార్థులను వ్యాయమ ఉపాధ్యాయుడు(పిడి) వాసు చితకబాదాడు. ఈ సంఘటన వివరాలు ఇలాఉన్నాయి. కొండపాక మండలం దుద్దెడ లో ఉన్న తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల అండ్ కళాశాలలో ప్రతిరోజు ఉదయం 5 గంటలకు విద్యార్థులు నిద్రలేచి 6 గంటల వరకు స్నానం చేసి స్టడీ క్లాస్‌కు హాజరవుతారు. బుధవారం రోజుమాదిరి గానే విద్యార్థులు ఉదయం 5.50 గంటలకు క్లాస్‌కు తయారై వెళ్లారు. అప్పటికే అక్కడున్న పిడి వాసు క్లాస్‌కు ఎందుకు అలస్యంగా వచ్చారంటూ 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 19 మంది విద్యార్థులను బెత్తంతో తీవ్రంగా కొట్టడంతో కొంత మంది విద్యార్థులకు చేతులు బాగా వాచి పోవడం, పిరుదలపై బొబ్బలు వచ్చాయి. దీంతో తీవ్రంగా గాయపడిన రాహుల్, పోచన్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రవల్లి అజయ్‌లను సిద్దిపేటకు పాఠశాల సిబ్బంది తరలించారు. మధ్యాహ్నం విషయం బయటపడడంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను ఎందుకు నిలదీశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఉపాధ్యాయుడి దెబ్బలకు విలవిలలాడుతున్న విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు విషయం తెలపకపోవడం, సిద్దిపేటకు చికిత్స కోసం తరలించడం బాధకరమైన సంఘటన. అంతేకాకుండా రాహుల్‌ను 4 రోజుల నుండి పిడి వాసు ప్రతిరోజు తీ వ్రంగా కొడుతున్నట్లు తెలిసింది. పిడి వాసు నెల రోజుల క్రితం సిద్దిపేటకు చెందిన పొడిశెట్టి నవదీప్ 9వ తరగతి చదువుతున్న విద్యారిని చితక బాదడంతో చేతికి ప్రాక్చర్ కావడంతో ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంతజరిగినా సహ ఉపాధ్యాయులు స్పందించకపోవడం విశేషం.


ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్‌ను సన్మానిస్తున్న భవాని

## కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా భవాని

**పెద్ద శంకరంపేట, జనవరి 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల భవానిని నియమించినట్లు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ నాయకురాలు అల్కలాంబ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతరావులు నియామక పత్రాన్ని మెయిల్ ద్వారా అందజేశారు. తనపై నమ్మకం ఉంచి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమించినందుకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలకు ఆమె ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాదులో మెదక్ ఉమ్మడి జిల్లా ప్రణా ళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్‌ను శాలువాలు, పూలమాలలతో అవుసుల భవాని సన్మానించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు రాజేష్‌కుమార్, నాయకులు జనార్దన్, గంగారెడ్డి, నరసింహ చారి, సత్యం, హరికిషన్, సంగమేశ్వర్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గానికి ఘన సన్మానం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న బిఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, జనవరి 8 ప్రభాతవార్త:** ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గానికి బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఇటీవలే సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కుంటి మల్లేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్యాట భాస్కర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బక్క సత్యనారాయణ ముదిరాజ్‌లతో పాటు కార్యవర్గాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. నూతన ఉత్సాహంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కార్యదర్శి జిన్నారం సత్యనారాయణ ముదిరాజ్, కోశాధికారి కుంటి రవి ముదిరాజ్, చిరుమని శ్రీనివాసు ముదిరాజ్, సభ్యులు ఊసన్న ఆంజనేయులు, శివంపేట ఆంజనేయులు. ప్యాట వీరేష్, చిరుమని దుర్గేష్, చిన్న నరసింహులు, కుంటి భాషయ్య, మసిరెడ్డిపల్లి పెంటయ్య, కుంటి శేఖర్, జిన్న వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు దేవేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మొగులయ్య, సూర్యనారాయణ, బండాల భాస్కర్, ఆంజనేయులు యాదవ్, నల్తూరు యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డును సందర్శించిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, జనవరి 8 (ప్రభాతవార్త):** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న డంపింగ్‌యార్డును బుధవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సందర్శించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో జరుగుతున్న ఇంటింటా సేకరించిన చెత్తను వేరుచేసే విధానాన్ని, విండ్రో కంపోస్టు, డ్రై రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. అలాగే రోజువారీ పొడి వనరులను ఎలా డిస్పోస్ చేస్తున్నారో వాటిని పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. విండ్రో కంపోస్టు తయారీలో ఎలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలను రాకుండా చూడాలని తెలియజేశారు. అనంతరం బయోమైనింగ్ ద్వారా వేరుచేసే కంపోస్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య


పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎంఇవో మాధవరెడ్డి తదితరులు

## చిరుధాన్యాలతో ఆరోగ్యం మెరుగు : ఎంఇవో

**జగదేవ్‌పూర్, జనవరి 8 (ప్రభాతవార్త):** చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులు, తల్లిదండ్రులు తయారుచేసిన వివిధ రకాల చిరుధాన్యాల వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు, కనకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికళ, ఉపాధ్యాయులు సత్తయ్య, అమృతమ్మ, భాస్కర్, నాగరాజు, బాల్‌రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ భూమయ్య, వివిధ పార్టీల నాయకులు దయానందరెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వరంగల్‌లో నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు


వరంగల్‌లో ఖో-ఖో పోటీలకు పయనమవుతున్న జిల్లా క్రీడాకారులు

**చౌటకూరు, జనవరి 8, ప్రభాతవార్త:** వరంగల్‌లో ఈ నెల 9వ తారీఖున ప్రారంభమై 11వ తేదీ వరకు జరుగనున్న 57వ రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీల్లో తలపడేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి క్రీడాకారులు బుధవారం తరలివెళ్లారు. చౌటకూరులో వారంరోజులుగా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా ఖో-ఖో అడ్‌హక్ కమిటి ఆధ్వర్యంలో 15 మందికి క్రీడాకారుడు కలాలి నాగ గౌడ్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. చౌటకూరులో త్వరలో జరగనున్న సీజన్ 3 ఖో-ఖో టౌర్నమెంట్‌లో క్రీడాకారులకు తమ వంతు సహకారం అందించేందుకు గ్రామానికి చెందిన దాతలు పార్కుల రామ్‌రెడ్డి, గౌని కిరణ్, పల్లె జనార్దన్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్‌లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. క్రీడాకారులకు టీ షర్టులు, బూట్లు తదితర వస్తువులు అందచేస్తామని దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పిఆర్‌టియు మండల అధ్యక్షులు ఈ మోహన్‌రెడ్డి, పీడి అరుణ పీఈటిలు నాగాగౌడ్, త్రిశూల్ పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో కంటి పరీక్షలు

**వర్గల్, జనవరి 8 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు బుధవారం గజ్వేల్ కంటి ఆసుపత్రి లోక్ నేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 300 మంది విద్యార్థినిలకు, అధ్యాపకులకు కంటి పరీక్షలు చేసి తలనొప్పి, కళ్ళ మంట, పార్శ్వపు నొప్పి, కళ్లలో నీరు కారడం మొదలగు సమస్యలను గుర్తించి తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్య నారాయణ, డిఓప వై.పరశురాం, ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఆర్.సంజీవ్, కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ గడ్డం భాస్కరరావు, హెల్త్ సూపర్వైజర్ ఉమారాణి, అసిస్టెంట్ సూపర్వైజర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అమీన్‌పూర్, జనవరి 8 ప్రభాతవార్త:** 132 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం (నేడు) మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పటేల్ గూడ విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించుటకు, లైన్ మరమ్మతుల కొరకు 11 కేవీ ఫీడర్ల సేఫ్టీ కోసం విద్యుత్ 33/11 కేవీ పటేల్ గూడ సబ్ స్టేషన్ పరిధిలోనీ 11 కేవీ బీహెచ్ఎల్ ఫీడర్, 11 కేవీ నవ్య ఫీడర్, 11 కేవీ సిద్ధార్థ ఫీడర్, 11 కేవీ రాఘవేంద్ర ఫీడర్, 11 కేవీ నర్రిగూడ, బీహెచ్ఎల్ మెట్రో, హరి విల్లు, ఎస్ఎల్ఎన్ 1, 2, 3, 4, సూర్యోదయ, యాక్సిస్ హోమ్స్, ఇందిరమ్మ ఇళ్లు, రాఘవేంద్ర కాలనీ, మధురా నగర్, భ్రమరాంబిక, కృష్ణా నగర్, బీరంగూడ, సిద్ధార్థ, గ్రీన్ ఫీల్డ్, గ్రీన్ మెడోస్, ప్రణీత్ విల్లాస్, నందన్ హోమ్స్, తులసి వనం, ఇస్కబాయి, గీతా హోమ్స్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

# సృష్టి అణువణువులో పరమాత్మ శక్తి

**అల్లాదుర్గం, జనవరి 8, ప్రభాతవార్త:**

సృష్టిలో అణువణువున పరమాత్మ శక్తి ఉంటుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. అల్లాదుర్గంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో సుదర్శన హోమం, అభిషేకం, సుప్రబాత సేవ, పుణ్యవచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగంపేట పీఠాధిపతి మాదవనంద సరస్వతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రవచనాలు వినిపించారు.

**స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎంపి...**

వైకుంఠ ఏకాదశిని పురష్కరించుకుని మాజీ ఎంపి బిబి పాటిల్ అల్లాదుర్గంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలన్ని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎంపి బిబి పాటిల్‌ను ఆలయకమిటి బాధ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందచేశారు. ఆలయ ఆవరణలో చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.


భక్తులకు ప్రవచనాలు చెబుతున్న రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**చేర్యాల, జనవరి 8, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన దొమ్మాట లచ్చవ్వకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం సహాయనిధి రూ.41,500 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు యూత్ ఇంచార్జీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివగారి అంజయ్య అందజేశారు. ఆయనతో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్, పట్టణ యూత్ అధ్యక్షులు యాట బిక్షపతి పాల్గొన్నారు.

## నాయి బ్రహ్మణ సేవా సంఘం నూతన కమిటీ

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** నాయీ బ్రహ్మణ సేవా సంఘం మండల కమిటీని బుధవారం కొండపాకలో ఎన్నుకున్నారు. అ సంఘం అధ్యక్షుడుగా దుంపలపల్లి కనకరాజు, ఉపాధ్యక్షుడుగా దుంపలపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, సహాయ కార్యదర్శుగా భానుప్రకాష్, కోశాధికారిగా జగదీశ్వర్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ దాడి హేయమైన చర్య

**కొండపాక, జనవరి 8, ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని కుకునూరుపల్లి మండల బిజెపి అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి అన్నారు. బుధవారం అయన కుకునూరుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. కాంగ్రెస్ నాయకుల అగడాలు రోజురోజుకు మితిమిరిపోతున్నాయని మండి పడ్డారు. కాంగ్రెస్ నాయకులు బరి తెగించి బిజెపి కార్యాలయంపై దాడి చేశారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామిలను అమలు చేయలేక రోజుకో డైవర్షన్ రాజకీయాలు చేస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు.

## తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

**చిన్నశంకరంపేట, జనవరి 8,ప్రభాతవార్త:** తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఆయిల్ ఫామ్ ను సాగు చేయాలని ఆయిల్ ఫామ్ పరిశ్రమ టెక్నికల్ మేనేజర్ రంగనాయకులు అన్నారు. చిన్న శంకరంపేట పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కల్పించారు. డిప్ పద్ధతి ద్వారా నీటి సరఫరా వంటి పద్ధతులపై రైతులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకహాలు అందిస్తుంది అన్నారు. ఆయిల్ పంప్ అంట మూడు సంవత్సరాల అనంతరం చేతికొస్తుందని తర్వాత మార్కెటింగ్ సదుపాయం ఉంటుందన్నారు. ఈ ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డిహెచ్ఎస్ఓ ప్రతాప్ సింగ్, ఏవో లక్ష్మీ ప్రవీణ్, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, హార్టికల్చర్ మండల ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, జనవరి 8, ప్రభాతవార్త :** మండల పరిధి ఖాజాపూర్ తండాకు చెందిన ధరవత్ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ బుధవారం నాడు వారి కుటుంబాన్ని పరామర్శించి బాధ్యత కుటుంబానికి 5000 ఆర్థిక సహాయంతో పాటు, 25 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో జి శ్రీనివాస్ నాయక్, సానిక్ షా ఫౌండేషన్ అధ్యక్షులు శివ, శంకర్ జగన్, మోతిలాల్ విటల్ గోపాల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**చిన్నశంకరంపేట, జనవరి 8,ప్రభాతవార్త:** మండల పరిధి కొరివిపల్లి గవ్వలపల్లి సంగాయపల్లి గజగట్లపల్లి లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం నాడు కంటి పరీక్షల నిర్వహించారు. లైన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు శస్త్ర చికిత్సలు, అద్దాలను ఉచితంగా అందిస్తామని వైద్యులు ఎమ్మెస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పుష్పవేని, గాలయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఉచితంగా సర్వీసు పుస్తకాల పంపిణీ

**నాగల్‌గిద్ద, జనవరి 8, ప్రభాతవార్త:** 2025-25 విద్యాసంవత్సరంలో నియమితులైన ఉపాధ్యాయులకు బుధవారం ఉచితంగా సర్వీసు పుస్తకాలను పిఆర్‌టియు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మాణెయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభుల సూచనల మేరకు మండల పిఆర్‌టియు అధ్యక్షులు శేరికర్ రమేష్, ప్రధాన కార్యదర్శి నాగ్‌నాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు ముందుంటుందని గుర్తు చేశారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ సేవ పుస్తకాలు ఉచితంగా పంపిణి చేసేందుకు సహకరించిన రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు మాణెయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మన్మధకిషోర్, నాగల్‌గిద్ద కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శంకర్ జల్లా అసోసియేట్ అధ్యక్షులు జితేందర్, సూర్యకాంత్, జీవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## యువజన సంఘాల శ్రమదానం


శ్రమదానంలో భాగంగా చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, జనవరి 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నేషనల్ హైవే 765-డీ ప్రక్కన చెత్తను మండల యువజన సంఘాల సమితి అధ్వర్యంలో తొలగించారు. శ్రమదానంలో గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ప్రభాకర్, జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు మంద భాస్కర్‌రెడ్డి, వీ.ఎం.ఎల్లయ్య పాల్గొని వారు మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండాలన్నారు. గ్రామీణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని, చుట్టూపక్కల చెత్తా చెదారం వేయకుండా సంపూర్ణ ఆరోగ్య గ్రామాలుగా తీర్చిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లెపల్లి ప్రకాష్, విష్ణువర్ధన్. ముద్దంగుల ప్రసాద్, బత్తెపు ఈశ్వర్, భయనోల్ల దాసు, ఉప్పరి శేఖర్, కోలుకూరి పోచయ్య పాల్గొన్నారు.

## నూతన కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**

**అమీన్‌పూర్, జనవరి 8 ప్రభాతవార్త:** నూతనకాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో గల విగ్నేశ్వర కాలనీ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రతి కాలనీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళామని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. మంచినీటి కోసం నిత్యం ఇబ్బందులు పడే మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీళ్లు అందించిన ఘనత తమ పాలకవర్గానికే దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, బిజిలి రాజు, చంద్రకళ గోపాల్, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ 50 వేల జరిమానా : సిఐ

**హుస్నాబాద్ టౌన్, (అక్కన్నపేట), జనవరి8, ప్రభాతవార్త**

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి బుధవారం రూ.50 వేల జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హుస్నాబాద్ ఎక్సైజ్ పరిధిలోని అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన దిడిగం రవితేజ గతంలో గుడుంబా తయారీదారులకు బెల్లం పటికలు సరఫరా చేస్తూ పట్టుపడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మరోసారి ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడననివెళ్లి తిరిగి గుడుంబా తయారీదారులకు బెల్లం పటికలు రవాణాచేస్తూ చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుపడి బైండోవర్ ఉల్లంఘించగా అతడిని అక్కన్నపేట తహసీల్దార్ ముందు హాజరుపరచగా వారి ఆదేశాల మేరకు నిందితుడైన రవితేజకు జరిమాన విధించినట్లు తెలిపారు. తమ స్టేషన్ పరిధిలో ఎవరైనా గుడుంబా తయారీ, రవాణా, అక్రమ అమ్మకాలు, బెల్లం పటికలు సరఫరా చేస్తే ఎంతటి వారైనా కఠినచర్యలు తీసుకోవడంతోపాటు పిడియాక్టు నమోదుచేస్తామని హెచ్చరించారు.

## వైకుంఠ ఏకాదశికి క్యూలైన్ల ఏర్పాటు

**కీసర, జనవరి 8, ప్రభాతవార్త:**
శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లుచేసినట్లు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆషాడ శుద్ధ ఏకాదశి నాడు కడలిలో యోగనిద్రకు ఉపక్రమించిన నారాయణుడు కార్తీక శుద్ధ ఏకాదశి రోజు మేల్కొంటారని ప్రతినిధి అన్నారు. సంవత్సరం మొత్తంలో ఈ ఒక్కరోజే చీర్యాల లక్ష్మీనృసింహ్మాస్వామివారిని సప్తద్వారాల ద్వారా అంటే వైకుంఠద్వారాలు ఏడుదాటి స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉంటుందన్నారు. స్వామి వారికి అర్ధరాత్రి 1 గంటకు స్వామి వారికి పంచామృత నవ కళాశాభిషేకం,ఉదయం 5 గంటలకు స్వామివారు (ఉత్సవమూర్తి) వైకుంఠ ద్వారాల నుండి దేవాలయంలోకి ప్రవేశిస్తారు,ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ఆద్వర్యంలో దీపారాధన,తులసి లక్ష పుష్పార్చన.సప్త హారతులు.ఉదయం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సప్త ద్వారాల దర్శనం ఉంటుందన్నారు,ఉదయం 7 గంటలకు సుదర్శన నృసింహ హోమం,భక్తులకు ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## విద్యకు మొదటి ప్రాధాన్యత....

**కొత్తూర్, జనవరి 8, ప్రభాతవార్త:**
పాఠశాలకు కావల్సిన వసతుల ఏర్పాటు కొరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కుమ్మరిగూడ గ్రామస్థులు కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తూర్ పురపాలకపరిధిలోని కుమ్మరిగూడ స్కూల్‌కి కావాల్సిన సౌకర్యాలకోసం కొత్తూర్‌మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, ఉపాధ్యక్షుడు బండారి భరత్‌గౌడ్ గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తమ ఊరి పాఠశాలసమస్యలను పరిష్కరించాలని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ స్కూల్‌సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకొరకు నిరంతరం కృషిచేయుటకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఈకార్యక్రమంలో పీర్లగూడెం మహేష్‌గౌడ్, బండారు రాజేష్‌గౌడ్, బండారు లక్ష్మీనారాయణ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## మున్సిపాలిటీలోని 7వ వార్డులో పారిశుధ్య లోపం

**శంకర్‌పల్లి, జనవరి 8, ప్రభాతవార్త:**
శంకర్‌పల్లి మున్సిపల్‌పరిధిలోని 7వవార్డులో పారిశుధ్యం లోపించింది. కాలనీలోగల ప్రధాన మురికికాలువలో ఇసుక,మట్టి నిండుగా పేరుకుపోవడంతో మురికినీరు ఇళ్ల ముందు మడుగును తలపిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శంకర్‌పల్లి పట్టణంలోని 25శాతం మురికినీరు ఈప్రధానకాలువ ద్వారానే గొల్లవాగు నదిలోకి వెళుతుంది. వర్షాకాలంలో మురికికాలువ నిండా నీరుపారుతుంది. కాలువలో ఇసుక, మట్టి నిండడంతో వర్షపునీరు ఇళ్ళముందు చేరుకుంటుంది. మురికికాలువలో ఉన్న మట్టిని తీసివేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రధాన మురికికాలువలో నిండిన ఇసుక, మట్టిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## చైర్మన్‌ను సన్మానించిన వర్తకులు



చైర్మన్ యాట గీత నర్సింహ్మను సన్మానిస్తున్న ట్రేడర్స్ అసోషియేషన్

**ఆమనగల్లు, జనవరి 8, ప్రభాతవార్త:**
ఆమనగల్లుపట్టణంలోని మార్కెట్‌యార్డు ట్రేడర్స్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మార్కెట్‌కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ్మను ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా నియమితులైన గీత నర్సింహ్మ పదవీబాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మార్యదపూర్వకంగా కలుసుకుని శాలువా, పూలమాలలతో సత్కరించారు. వర్తకులతో పలు అంశాలపై చర్చించారు. రైతులకు మేలైన సేవలందించాలని సూచించారు. మార్కెట్‌యార్డు అభివృద్ధిలో ట్రేడర్స్, మిల్లర్స్‌పాత్ర కీలకమని కొనియాడారు. రైతుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్రసర్కారు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. సన్నవడ్లు బోనస్ ఇవ్వడంతో అనేకమంది రైతులకు ప్రయోజనం చేకూరిందని సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వ తోడ్పాటుతో ఆమనగల్లు మార్కెట్‌యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సన్మానించిన వారిలో రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మిట్లపల్లి అంజయ్య, ట్రేడర్స్‌సంఘం ప్రతినిధులు కండె పాండురంగయ్య, దోనాదుల సత్యం, అనిల్ రామకృష్ణ, కండె సుమన్, కాసుల కృష్ణయ్య, కరుణాకర్, రాము, విష్ణువర్ధన్, శ్రీనివాస్, కండె భాస్కర్, సత్యం, యాదయ్య, వెంకటయ్య, బిర్లకంటి ప్రకాష్, మార్కెట్‌యార్డు కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

## భగవద్గీత కంఠస్థ పోటీల్లో సాయిసుప్రీత్‌కు బంగారు బహుమతి



గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా బంగారుపతకాన్ని, ప్రశంసాపత్రం అదుకుంటున్న సాయిసుప్రీత్

**షాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
బెంగళూరు శ్రీదత్తపీఠం ఆధ్వర్యంలో అంతర్జాతీయస్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థంపోటీల్లో షాబాద్ ధ్యానహిత పాఠశాలకుచెందిన సాయిసుప్రీత్ బంగారుబహుమతి గెలుచుకున్నాడు. విజయవాడలో శ్రీగణపతి సచ్చిదానందస్వామి చేతులమీదుగా సాయిసుప్రీత్ ఈబంగారుపతకాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు. భగవద్గీత కంఠస్థంలో బంగారు బహుమతి గెలుచుకొని షాబాద్ ధ్యానహిత పాఠశాలకు పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చాడని, పాఠశాల యాజమాన్యం సాయిసుప్రీత్‌ను, అతని తల్లిదండ్రులను అభినందించారు.

## కురువగూడలో కంటి వైద్యశిబిరం

**షాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కురువగూడగ్రామంలో బుధవారం కంటి వైద్యశిబిరాన్ని మాజీసర్పంచ్ సంధ్యారాణి మల్లికార్జున్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. కంటిజబ్బులను నిరక్ష్యంచేయకుండా ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించుకుని కళ్ళకు ఇబ్బందులులేకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో షాద్‌నగర్‌కుచెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో గ్రామంలోని ప్రజలకు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు. కంటికి శస్త్రచికిత్సలు అవసరం ఉన్నవారికి ఆసుపత్రికి రిఫర్‌చేశారు. కంటిజబ్బులను నిరక్ష్యంచేస్తే జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. కళ్లకు వచ్చు వ్యాధులను నిరక్ష్యంచేయకుండా వైద్యుల సలహాలు, సూచనల పాటించాలన్నారు. కార్యక్రమంలో కంటివైద్యులు, ఆసుపత్రిసిబ్బంది, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

# ఆమనగల్లులో బిజెపి ఆందోళన



ఆమనగల్లులో ధర్నా చేస్తున్న బిజెపి శ్రేణులు

**ఆమనగల్లు, జనవరి 8, ప్రభాతవార్త:**
ఆమనగల్లుపట్టణంలో బుధవారం భారతీయ జనతాపార్టీ ఆందోళన కార్యక్రమం నిర్వహించింది. జాతీయరహదారిపై నిరసనర్యాలీ నిర్వహించి రాజీవ్ చౌరస్తాలో బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్‌శ్రేణులు నాంపల్లిలో బిజెపి రాష్ట్రకార్యాలయం, బిజెపి శ్రేణులనుపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు మెండెం శ్రీకాంత్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనకార్యక్రమంలో చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలం చెందుతుందని విమర్శించారు. బిజెపికార్యాలయం, కార్యకర్తలపై యువజనకాంగ్రెస్ చేసిన దాడి ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చగా వారు అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థపాలన, పోలీసులు అధికారపార్టీతో అంటగాకుతుండడంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని, అధికారపార్టీ దాడులుచేయడం ఆపార్టీ నియంత పాలనకు నిదర్శనమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదుచేసి అరెస్టుచేయాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్‌పార్టీ వెంటనే బిజెపికి క్షమాపణలుచెప్పాలని కోరారు. రాజకీయరంగంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉండాలే కానీ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ దాడులతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టిందని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ్మ, సుందూరి చంద్రశేఖర్, బైకని శ్రీశైలంయాదవ్, దుడ్డు కృష్ణయాదవ్, చెన్నకేశవులు, కృష్ణనాయక్, విక్రమ్‌రెడ్డి, విజయ్ కృష్ణ, మేడిశెట్టి శ్రీధర్, పాష, నాగిళ్ళ బుచ్చయ్య, గోజె ఆనంద్, కెకె శ్రీను, వడ్డెరాజు, బైకని అశోక్, నాగిళ్ళ లక్ష్మణ్, పద్మ ప్రశాంత్, వరికుప్పల శ్రీనివాస్, గోరటి గిరి, ఎర్రవోలు మహేశ్, ఎర్రవోలు రాజు, వరికుప్పల రాఘవేందర్, సందీప్, చెన్నకేశవులు, పవన్, బాలు, భాస్కర్, లండం కృష్ణయ్య, తల్లోజు శ్రీను, శ్రీశైలం, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాదవులు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలి

**-మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్**



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 8:**
ఈనూతన సంవత్సరం ప్రజలకు శుభాలు, విజయాలు, సంతోషాలు, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలు కలగాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్య యాదవ్ కోరారు. అఖిలభారత యాదవమహాసభ రంగారెడ్డిజిల్లా ప్రధానకార్యదర్శి నడికుడ రఘునాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2025 నూతనసంవత్సర క్యాలెండర్‌ను బుధవారం పట్టణంలోని రఘునాథ్‌యాదవ్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈకార్యక్రమానికి హాజరైన యాదవసంఘం నాయకులకు నూతన క్యాలెండర్లను అందజేశారు. అనంతరం అంజయ్యయాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. ఎవరికీ నష్టంచేయని జాతి యాదవులదని, జాతిసమగ్రతకు విద్య, రాజకీయ, ఆర్థికచైతన్యం ఎంతో ముఖ్యమన్నారు. ఈకార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ దారమోని బన్నయ్యయాదవ్, యాదవమహాసభ జిల్లా అధ్యక్షుడు నడికుడ రఘునాథ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు నక్క బాల్‌రాజ్‌యాదవ్, ఆలుగడ్డ ప్రవీణ యాదవ్, గడ్డం రాజ్యలక్ష్మీయాదవ్, మన్నె నారాయణయాదవ్, ఎల్లనమోని శ్రీనివాస్‌యాదవ్, చీపిరి రవియాదవ్, రవీందర్‌యాదవ్, తుమ్మల జగనన యాదవ్, దన్నాడ వెంకటేష్‌యాదవ్, జొల్లు బాలయ్యయాదవ్, దొంద్ర ప్రవీణ్‌యాదవ్, శేఖర్‌యాదవ్, నర్సింలుయాదవ్, భూపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిది..



గణితమేళాను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఇతర అధికారులు

**దుద్యాల్, జనవరి 8, ప్రభాతవార్త:**
గణితమేళాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ విజయరామారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మండలస్థాయి గణితమేళాను నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ గణితపరికరాలను నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన త్రిభుజం, చతురస్రం, దీర్ఘచతురస్రం, చతుర్భుజం, రాంబస్, సరళరేఖలు, ఖండనరేఖలు, కోణం వంటి పరికరాల గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ విజయరామారావు, మాట్లాడుతూ, గణితం అన్నిశాస్త్రాలకు తల్లివంటిదని అన్నారు. ప్రతి గణిత అంశం ప్రతిరోజు మనల్ని ప్రభావితం చేస్తుందన్నారు. గణితం లేకపోతే ప్రపంచం పురోగతి సాధించలేదు అన్నారు. గణితమేళాలు విద్యార్థులలోని సృజనాత్మకత , అన్వేషణావిధానాన్ని, జ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. గణితమేళాలో పాల్గొన్న విద్యార్థుల ను అభినందించారు. మండ లంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గణితమేళాలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు రాహుల్, కృష్ణ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు నరేందర్, మల్లప్ప, శంకరప్ప, గణిత ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, వెంకటయ్య, రాములు, సుధాకర్‌రావు, శ్రీనివాస్, రవినాయక్, రమేష్, ముకుందరెడ్డి, తిరుపతయ్య, చందర్‌నాయక్, సంపత్, వెంకటేష్, ఉమా మహేష్, తేజస్విని, అస్మ సుల్తానా, అర్ష బేగం, రమ తదితరులు పాల్గొన్నారు.

## డేంజరస్ డ్రైవింగ్ వద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 8:**
నిబంధనలకు విరుద్ధంగా డేంజరస్ డ్రైవింగ్ చేయడం మంచిదికాదని, యువత ఎల్లప్పుడు ట్రాఫిక్‌నియమాలు పాటించాలని షాద్‌నగర్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌నాయక్ సూచించారు. జాతీయరహదారుల భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులను షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తరపున చైతన్యపరిచారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, బిఏఎం డిగ్రీ కళాశాల, విజ్ఞాన్ డిగ్రీకళాశాలలో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, లైసెన్సులేకుండా వాహనాలునడపడం, ట్రిబుల్‌రైడింగ్, అత్యంత వేగంగా వాహనంనడపడం, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడంవల్ల ట్రాఫిక్‌నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యార్థులకు సూచించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటివి ట్రాఫిక్ రూల్స్ వ్యతిరేకమని తెలిపారు. యువత ట్రాఫిక్‌రూల్స్ కచ్చితంగా పాటించాలని సూచించారు.

## ఎమ్మెల్యేను అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్ర



సిఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదును అందజేస్తున్న కాంగ్రెస్‌నాయకురాలు నాగమణి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 8:**
షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురించి ఎమ్మెల్యే గురించి సోషల్‌మీడియాలో అనుచితపోస్టులుపెట్టిన ఇద్దరువ్యక్తులు గంతల నాగరాజు, బూర్గుల రమేష్ (ఆర్ఎంపీ వైద్యుడి)పై పోలీసులు చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలు జె.నాగమణి డిమాండ్‌చేశారు. ఎలాంటి కనీసజ్ఞానం లేకుండా కనీసం సమాజ అవగాహనలేకుండా వార్తలురాసే పద్ధతి కూడా లేకుండా సోషల్‌మీడియాలో అనవసర పోస్టులుపెట్టడం, సమాజాన్ని పక్కతోవపట్టించే ప్రయత్నం జరుగుతోందని, దీనివెనక ఎవరెవరు ఉన్నారో కాల్‌డేటా ఆధారంగా విచారణజరిపి భాగస్వాములవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో మంచిపేరు ప్రఖ్యాతలు రోజురోజుకు పెరిగిపోతున్న ఎమ్మెల్యే శంకర్‌ను మీడియాతో ముడిపెట్టి అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్రచేశారని, ఇలాంటివారివల్ల అసలైన విలేకరులకు నష్టంజరిగే అవకాశం ఉందని, ఇలాంటివారిపై పూర్తిస్థాయిలో నిఘాపెట్టి ఇటు పోలీసులు, నకిలీవైద్యుల ముసుగులో ఉంటున్న వారి పట్ల అటు వైద్యాధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

# అనుమతుల్లేని క్లినిక్‌లపై కఠిన చర్యలు

## డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ




అనుమతి లేని క్లినిక్‌లను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జనవరి 8:**
ఎలాంటి ప్రభుత్వ అనుమతిలేకుండా అదేవిధంగా అర్హతలేకుండా వైద్యులుగా కొందరు చెలామణీ అవుతున్న నేపథ్యంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, హెల్త్ ఎద్యుకేటర్ శ్రీనివాస్ తదితర బృందం పలు గ్రామాల్లో పర్యటించారు. ఫరూఖ్‌నగర్‌మండలంలోని కమ్మదనం, బూర్గులగ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తుండడం పట్ల సంబంధిత వ్యక్తి రమేష్ అనేయువకుడిని వైద్య అధికారులు వివరణ కోరారు. కమ్మదనం గ్రామంలో చైత్ర క్లినిక్ నిర్వహిస్తున్న సందర్భంగా నిబంధన గురించి ప్రశ్నించారు. క్లినిక్ మూసి ఉండడంతో క్లినిక్‌కు సంబంధించిన అనుమతి తదితర పత్రాలను తనిఖీ చేయడానికి అతడికి ఫోన్ చేసినట్లు తెలిపారు. ప్రాథమికవైద్యం పేరుతో నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహిస్తున్నారని తెలుసుకొని వెంటనే చైత్ర క్లినిక్‌బోర్డును అధికారులు తొలగించినట్లు తెలిపారు. అన్‌క్వాలిఫైడ్, ప్రభుత్వ అనుమతులు లేని గ్రామీణప్రాంతాల్లో ప్రజలకువైద్యం నిర్వహించకూడదని ఎవరైనా ఇలానిర్వహించేవారు ప్రభుత్వ అనుమతులు, సంబంధిత అనుమతిపత్రాలు అన్ని ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యవహారంలో విచారణ చేపడుతున్నామని, క్లినిక్‌కు సంబంధించిన పత్రాలతోపాటు వైద్యం చేసేందుకు ఉన్న అర్హతలగురించి వాకబు చేయడానికి సంసిద్ధం అయినట్లు తెలిపారు. నేడు క్లినిక్‌కు సంబంధించిన అర్హతపత్రాలు సమర్పించాలని సూచించినట్లు తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, అర్హతలేకుండా వైద్యంచేస్తే చట్టరీత్యా ప్రభుత్వ నిబంధనానుసారం చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## భూములు లాక్కుని మా బతుకులు ఆగం చేయకండి



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న సిఐ ప్రమోద్‌కుమార్

**ఆమనగల్లు, జనవరి 8, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం నూతనంగా నిర్మించబోతున్న గ్రీన్‌ఫీల్డు రోడ్డునిర్మాణంతో జీవనాధారమైన మా విలువైన భూములు కోల్పోవలసి వస్తుందని సాకిబండతండా రైతులు ఆందోళన చేపట్టారు. అభివృద్ధి పేరిట భూములు లాక్కుంటే ఉపాధిలేక కుటుంబాలు రోడ్డున పడుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మూడవవార్డు సాకిబండతండాకు చెందిన రైతులు ఆందోళన చేపట్టారు. సాకిబండతండా పరిసరాలలో సర్వే వద్దకు భూములు కోల్పోతున్న రైతులు మణిపాల్, బోద్య, చందర్, పాండు, రవిరాథోడ్, రమేష్, గోపి, లాలు, విజేందర్, రాజా, వినోద్, గోపి, శివరాం, జాన్య, పత్య, రమ్మి, కుమార్, పత్యనాయక్, హరి, తరుణకుమార్, ఇతర రైతులు గో బ్యాక్ అంటూ నినదిస్తూ అక్కడే బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో స్థానిక సిఐ ప్రమోద్‌కుమార్ హూటాహుటిన అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఆందోళన చేస్తున్న రైతులు వినకపోవడంతో కాసేపు అక్కడ రైతులనినాదాలు హోరెత్తాయి. పోలీసులు సర్దిచెప్పినా వారు ససేమిరా అనడంతో చివరికి సర్వేసిబ్బంది పైఅధికారుల ఆదేశానుసారం అక్కడినుండి వెనుతిరిగిపోయారు. కాగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డునిర్మాణంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ సాకిబండతండా రైతులు గత కొన్నిరోజులుగా నిరసన, ఆందోళన చేపడుతున్నారు. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటుపడాలి



ముడిమ్యాలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 100మంది కార్యకర్తలు

**చేవెళ్ళ, జనవరి 8, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పాటుపడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పిలుపు నిచ్చారు. రాష్ట్ర రోడ్లుభవనాలశాఖ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల మాజీ ఎంపి రంజిత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి పామెన భీంభరత్‌ల సమక్ష్యంలో సుమారు వందమంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేశారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాలువాలను కప్పి పార్టీలోకి అహ్వానిం చారు. ఈసందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీకోసం పనిచేసిన నాయకులకు కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పడాల వెంకట్‌స్వామి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల సహకారసంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్‌కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, జనార్దన్‌రెడ్డి, మర్పిల్లి క్రిష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, పడాల ప్రభాకర్, సున్నపు వసంతం, గుండాల రాములు, మధుసూదన్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మహిళ నాయకురాళ్లు గోనే సరిత ప్రతాప్‌రెడ్డి, దేవర సమత వెంకట్‌రెడ్డి, బండారి శైలజ ఆగిరెడ్డి, రావులపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక పండగలు..



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

**షాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:**
మన సంస్కృతీసంప్రదాయాలకు పండగలు ప్రతీక అని హోప్ ఫౌండేషన్ ఛైర్మన్, ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ కొండ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం షాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి రంగోలీ(ముగ్గుల) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఆయన నగదుబహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 64మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదం చేస్తాయని అన్నారు.కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు మల్లికార్జున్, షఫీ,అడ్డూ,రాకేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నూతన శౌచాలయాలు



నూతన శౌచాలయాలను ప్రారంభించిన అమ్మాఆదర్శపాఠశాల చైర్మన్ ప్రేమలత

**కీసర, జనవరి 8, ప్రభాతవార్త:**
యాద్గార్‌పల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం అమ్మా ఆదర్శ,ఎంపిటిసి నిధులతో నూతనంగా నిర్మించిన శౌచాలయాలు అమ్మ ఆదర్శ చైర్మన్ లక్కపావుల ప్రేమలత చేతులమీదుగా బుధవారం ప్రారంభించారు. పాఠశాలల్లో సౌకర్యాల కల్పనలో సమాజం ఇతోధికంగా పాలుపంచుకున్నప్పుడే పాఠశాలలు బాగుంటాయన్నారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక పాఠశాల ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు చీర యాదగిరి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి : ఆంజనేయులు ముదిరాజ్.**

**కుల్కచర్ల, జనవరి8, ప్రభాతవార్త:** మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గంతో పలు అభివృద్ధి పనులపై మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.